www.prajasakti.com

# ప్రజాశక్తి

శనివారం 2 సెప్టెంబర్ 2023

5

ఏలూరు



## సిపిఎస్‌ను రద్దు చేయాలని నిరసన

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ఎపి సిపిఎస్ ఉద్యమ నాయకులు శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎస్ ఉద్యమ నాయకులు ఆర్.నాగదుర్గారావు మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిపిఎస్ విధానం వల్ల ఉద్యోగులకు నష్టం తప్ప లాభం లేదన్నారు. ఉద్యోగి దాచుకున్న డబ్బు దోచుకొని పెన్షన్ ఇవ్వడం ఎంటని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. యుటిఎఫ్ నాయకులు షరీఫ్ మాట్లాడుతూ ఉద్యోగికి వృద్ధాప్యంలో అండగా ఉండాల్సిన ప్రభుత్వం వాళ్ల దగ్గర ఉన్న సొమ్ము కూడా లాగేసుకోవడనికి చూస్తుందని వాపోయారు. అనంతరం ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ సోమేశ్వరరావుకు వినతిపత్రం అందించారు.

# కమ్ముకొస్తున్న కరువు...!



ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లిలో ఎండిన చెరువు



చింతలపూడి మండలం ఫాతిమాపురంలో వర్షంలేక బీటలు వారిన వరిపైరు

**ఖరీఫ్ సాగుపై వర్షాభావ ప్రభావం**

**ఆగస్టులో అత్యంత దారుణంగా ఏలూరు జిల్లాలో 62 శాతం లోటు వర్షపాతం నమోదు**

**26 మండలాల్లో మైనస్ వర్షపాతం**

**పలు మండలాల్లో ఎండిపోతున్న వరిచేలు**

**చెరువులు ఎండిపోవడంతో భూగర్భ జలాలపై ప్రభావం**

**తాగునీటి కోసం పశువులు సైతం అల్లాడుతున్న పరిస్థితి**

**ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి**

వర్షాభావం నేపథ్యంలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలు కరువు కోరల్లో చిక్కుకునే విపత్కర పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాధార పంటలు పూర్తిగా దెబ్బతినే పరిస్థితి ఏర్పడింది. చెరువులు, కుంటలు ఎండిపోవడంతో భూగర్భజలాలపైనే తీవ్ర ప్రభావం పడుతోంది. గడిచిన ఆగస్టులో అత్యంత దారుణంగా జిల్లాలో సరాసరి వర్షపాతంలో 62 శాతం లోటు వర్షపాతం నమోదైంది. 60 శాతంపైగా లోటు వర్షం పాతం నమోదైన మండలాల్లో లింగపాలెం, టి.నరసాపురం, జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, ద్వారకాతిరుమల, ఉంగుటూరు, పోలవరం, కొయ్యలగూడెం, భీమడోలు, పెదవేగి, పెదపాడు, చాట్రాయి, ముసునూరు, నూజివీడు, ఆగిరిపల్లి వంటి మండలాల్లో ఉన్నాయి. ఏలూరు జిల్లాలో 27 మండలాలుండగా ఆగస్టులో 26 మండలాల్లో మైనస్ వర్షపాతం నమోదైంది. గోదావరి డెల్టా ఆధారిత ప్రాంతమైన పశ్చిమగోదావరి జిల్లాలో ప్రస్తుతం కొంతమెరుగ్గా ఉన్నప్పటికీ, ఏలూరు జిల్లాలోని మెట్టప్రాంతంలో మాత్రం పరిస్థితులు ప్రమాదకరంగా మారుతున్నాయి. వరుణుడు ముఖం చాటేయడంతో ఖరీఫ్‌సాగుపై తీవ్ర ప్రభావం పడుతోంది. సాగునీరులేక పొలాలు దెబ్బతింటున్నాయి. రెండు జిల్లాల్లో దాదాపు నాలుగు లక్షల ఎకరాల్లో వరి పంటను రైతులు సాగుచేశారు. ఏలూరు జిల్లాలో దాదాపు 2.30 లక్షల ఎకరాల్లో వరిసాగు జరిగింది. ఇందులో వర్షాభావం, మోటార్లపై ఆధారపడిన సాగు పెద్దఎత్తున ఉంది. కుక్కునూరు, వేలేరుపాడు వంటి మండలాల్లో మిర్చి, పత్తి వంటి పంటలను రైతులు సాగుచేశారు. చినుకుజాడలేక జనం అల్లాడిపోతున్నారు. వేసవితరహాలో ఎండలు కాస్తుండటంతో ఉక్కపోతకు అల్లాడుతున్న పరిస్థితి నెలకొంది. చింతలపూడి మండలంలో దాదాపు 2,300 ఎకరాల వరకూ వర్షాధారంతో వరిసాగును రైతులు చేపట్టారు. వర్షాభావం వరి పంట దెబ్బతినే పరిస్థితి నెలకొంది. ద్వారకాతిరుమల మండలం ఎం.నాగులపల్లిలో ఉన్న చెరువులన్నీ ఎండిపోవడంతో పశువులకు సైతం తాగునీటికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో పట్టిసీమ ద్వారా చెరువులను నింపాలని అక్కడ రైతులు రోడ్డెక్కి ఆందోళన చేసిన పరిస్థితి నెలకొంది. మెట్టప్రాంతంలోని చెరువులు వర్షాల్లేక ఎండిపోతున్నాయి. దీంతో ఇటు పంటలకు, పశువులకు సైతం నీటి ఇబ్బందులు తలెత్తే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వర్షాలు లేకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి మోటార్ల బోర్లు నుంచి సైతం నీరు సక్రమంగా రావడం లేదు. దీంతో కరువు ఛాయలు ఉమ్మడి జిల్లాలో కనిపిస్తున్నాయి. అనేక మండలాల్లో ప్రత్యామ్నాయ పంటల కింద మినుము, పెసర వంటిపంటలు వేశారు. వర్షం లేకపోవడంతో ఆ పంట కూడా దెబ్బతినే పరిస్థితి నెలకొంది. ఏజెన్సీ ప్రాంతంలో వేసిన మిర్చి, పత్తిపంటలు సైతం వర్షాభావం కారణంగా ఇబ్బందుల్లో చిక్కుకున్నాయి. మరికొద్దిరోజుల్లో వర్షాలు పడకపోతే ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో దుర్భర పరిస్థితులు నెలకొనే ప్రమాదం కనిపిస్తోంది. ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులకు ఏంచేయాలో అర్థంకావడం లేదు. జూలైలో వర్షం సరిపడనంత కురవడంతో రైతులు పంటలు వేశారు. ఆగస్టుకు వచ్చేసరికి పూర్తిగా వరుణుడు కనుమరుగైన పరిస్థితి ఉంది. దీంతో వేసిన పంటలు ప్రమాదంలో పడ్డాయి. పశ్చిమగోదావరి జిల్లాలో ప్రస్తుతానికి సాగునీటి ఇబ్బందులు లేకపోయినప్పటికి మరికొద్దిరోజులు ఇదే పరిస్థితి కొనసాగితే తీవ్ర ఇబ్బందులు తప్పవని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. ఎండలకు వరిపొలాలు తెగుళ్ల బారిన పడుతున్నట్లు రైతులు చెబుతున్నారు. వర్షాలు లేక కరువు ఛాయలు అలముకుంటున్నాయి.

**ఆగస్టు నెలలో మండలాల వారీగా వర్షపాతం వివరాలు**

| మండలం | కురిసిన వర్షం(మి.మీ) | కురవాల్సిన వర్షం | లోటు(శాతం) |
|---|---|---|---|
| వేలేరుపాడు | 208.8 | 304.1 | 31 |
| కుక్కునూరు | 169.4 | 263.2 | 36 |
| చింతలపూడి | 97.8 | 244.5 | 60 |
| లింగపాలెం | 68 | 238.7 | 72 |
| టి.నరసాపురం | 28.7 | 229.6 | 88 |
| జీలుగుమిల్లి | 139.8 | 267.1 | 48 |
| బుట్టాయగూడెం | 163.4 | 296.9 | 45 |
| పోలవరం | 59.9 | 242.3 | 75 |
| కొయ్యలగూడెం | 99.5 | 267.8 | 63 |
| జంగారెడ్డిగూడెం | 62 | 262.7 | 76 |
| కామవరపుకోట | 45.6 | 255.8 | 82 |
| ద్వారకాతిరుమల | 45.2 | 196.3 | 77 |
| ఉంగుటూరు | 67.5 | 251.5 | 73 |
| భీమడోలు | 82.8 | 214.7 | 61 |
| పెదవేగి | 70.8 | 244.5 | 71 |
| పెదపాడు | 65 | 252.4 | 74 |
| ఏలూరు | 34.8 | 254.5 | 86 |
| దెందులూరు | 106.9 | 202.3 | 47 |
| నిడమర్రు | 113.9 | 256 | 56 |
| చాట్రాయి | 55.5 | 244.1 | 77 |
| ముసునూరు | 42.8 | 221.9 | 81 |
| నూజివీడు | 11 | 216.5 | 95 |
| ఆగిరిపల్లి | 64.1 | 227.5 | 72 |
| మండవల్లి | 88.5 | 241.8 | 63 |
| కైకలూరు | 158.6 | 175.2 | 10 |
| కలిదిండి | 103.6 | 211 | 51 |
| ముదినేపల్లి | 200.7 | 165.1 | ప్లస్22 |
| **జిల్లా సరాసరి మొత్తం** | **90.9** | **238.8** | **62** |

# సామాన్యులు బతకలేని విధంగా భారాలు

**సిపిఎం సమరభేరిలో నేతలు - జిల్లావ్యాప్తంగా కొనసాగిన ఆందోళనలు - సంతకాలు చేస్తూ ఆదరిస్తున్న ప్రజలు**

**ప్రజాశక్తి - యంత్రాంగం**

**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భారాల దెబ్బకు సామాన్య, మధ్యతరగతి ప్రజలు బతకలేని పరిస్థితి రాష్ట్రంలో దాపురించిందని సిపిఎం నేతలు తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ గతనెల 28వ తేదీ నుంచి ఈనెల నాలుగో తేదీ వరకు జరిగే సిపిఎం 'సమరభేరి'లో భాగంగా శుక్రవారం జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు కొనసాగాయి. ఈ సందర్భంగా పార్టీ నేతలు ప్రభుత్వాల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో సిపిఎం నేతలు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. అనంతరం ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. అనేకచోట్ల గ్రామసచివాలయాల వద్ద ధర్నా చేపట్టి, అధికారులకు వినతులు అందించారు.**



జంగారెడ్డిగూడెంలో..

**ఏలూరు :** విద్యుత్ అదనపు ఛార్జీలు రద్దు చేయాలని, పన్నుల భారాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలని సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ డిమాండ్ చేశారు. సిపిఎం చేపట్టిన సమరభేరిలో భాగంగా ఏలూరు పడమరవీధి, రామకృష్ణాపురం, పోస్టల్‌కాలనీ, శనివారపుపేట, శాంతినగర్, సత్రంపాడు తదితర ప్రాంతాల్లో ప్రచార సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా కిషోర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఎం పోరాటం చేస్తోందన్నారు. వచ్చే ఎన్నికల నేపథ్యంలో కేంద్రం గ్యాస్ సిలిండర్‌పై రూ.200 తగ్గించిందని విమర్శించారు. బిజెపికి చిత్తశుద్ధి ఉంటే పెట్రోల్, డీజిల్ రూ.50, రూ.60కు, గ్యాస్ సిలిండర్ రూ.400కే ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.ఆదిశేషు, వి.సాయిబాబు, బి.జగన్నాథరావు, కె.రామాంజనేయులు, జి.రవికిషోర్, ఎం.ఇస్సాక్, ఎం.శ్రీనివాసరావు, ఎస్.సత్యనారాయణ, జి.కోటేశ్వరరావు, జి.ఏసుబాబు, సి.బాలరాజు, జోగి నాయుడు పాల్గొన్నారు.




భీమడోలులో..

**భీమడోలు:** సిపిఎం సమరభేరికి ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు అన్నారు. ఈ సందర్భంగా సిపిఎం కార్యకర్తలు భీమడోలు రైస్ మిల్లు ప్రాంతం వద్ద సమరభేరి ప్రచార కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాల పంపిణీ చేశారు. ప్రజల నుంచి సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కట్టా భాస్కర్‌రావు, కేతా నాగయ్య, బీబీ పాల్గొన్నారు.

**నూజివీడు రూరల్ :** నూజివీడు పట్టణంలోని 10, 12, 13, 15 వార్డు సచివాలయాల వద్ద సిపిఎం సమరభేరి నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.రాజు, నాయకులు ఎన్ఆర్.హనుమాన్లు, శోభనాద్రి శీను, జిలాని, సాంబయ్య, అబ్బు శశి, మహాలక్ష్మి పాల్గొన్నారు.

**కొయ్యలగూడెం :** మండలంలోని గవరవరంలో సిపిఎం సమరభేరి కార్యక్రమం నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా కరపత్రాలు పంచుతూ సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు శుక్లబోయిన రాంబాబు, ఆకుల దుర్గారావు, కడియం సీతారాముడు, కె.దుర్గారావు, శుక్లబోయిన మహాలక్ష్మి, ఎస్.వెంకటలక్ష్మి, జక్కు విజయ, దుర్గమ్మ, సత్యనారాయణ, జక్కు లక్ష్మి, శుక్ల బోయిన లక్ష్మి పాల్గొన్నారు.

**వేలేరుపాడు :** నార్లవరం గ్రామ సచివాలయం ముందు సిపిఎం నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి ధర్ముల రమేష్, జిల్లా కమిటీ సభ్యులు మడివి దుర్గారావు మాట్లాడారు. అనంతరం సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మంగరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.నాగు, సరోజిని, జల్లి వంశీ, బాలాదిత్య, తొండ, లక్ష్మయ్య, అభి, సోడే ప్రసాద్, పండా పంతులు ఉన్నారు.

**చింతలపూడి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న భారాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు డివిఎన్‌వి.ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక పాతబస్టాండ్ వద్ద గల గ్రామ సచివాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ఆర్‌విఎస్.నారాయణ, ఎస్.సూర్యకుమార్, జోషి, రాధా, వాసు పాల్గొన్నారు.

**కుకునూరు :** మండలంలోని దాచారం, కుక్కునూరు సచివాలయాల వద్ద సిపిఎం సమరభేరిలో భాగంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి వై.నాగేంద్రరావు, సిపిఎం నాయకులు పట్ల లక్ష్మయ్య, చుక్కమ్మ, వలీ పాషా, భద్రం పాల్గొన్నారు

**కలిదిండి :** మండలంలోని పెదలంక, మూలలంక, భాస్కరరావు పేట, కలిదిండి, పడమటిపాలెం సచివాలయాల వద్ద సిపిఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. గ్రామాల్లో పర్యటించి, సంతకాల సేకరణ చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు వీరవల్లి భాస్కరరావు, సిహెచ్.సత్యన్నారాయణ, పి.బాలాజీ, పైలా వెంకటరామకృష్ణ, సత్యనారాయణ, రాజేష్, మహాలక్ష్మి, వరలక్ష్మి, శ్రీనివాసరావు, పెద్దిరాజు, ఏసు, అనిల్‌కుమార్, వెంకటేశ్వరరావు, గోపి, రఘు పాల్గొన్నారు.

**ముసునూరు :** ముసునూరు, చింతలవల్లి సచివాలయాల వద్ద సిపిఎం సమరభేరి నిరసనలు చేపట్టారు. అనంతరం పంచాయతీ సెక్రటరీకి వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కంచర్ల దుర్గారావు, తోటకూర ప్రసాద్, శ్రీను, గంగుల సత్యం, పి.కుటుంబరావు పాల్గొన్నారు.

**బుట్టాయిగూడెం :** మండలంలోని రెడ్డిగణపవరం, జైనవారిగూడెం సచివాలయాల వద్ద సమరభేరిలో భాగంగా వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ మాట్లాడారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు పి.మంగరాజు, మండల కమిటీ సభ్యులు కె.జలపాలు, పూనెం దుర్గారావు, తాటి రాంబాబు, మడివి రాజు పాల్గొన్నారు.

**నిడమర్రు :** సిపిఎం సమరభేరిలో భాగంగా భువనపల్లి సచివాలయం వద్ద ధర్నా చేపట్టి కార్యదర్శికి వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో గవర సత్యనారాయణ, కోన శ్రీనివాసరావు, వెలగలేటి మోహన్ పిల్లా సూర్యనారాయణ పాల్గొన్నారు.

**ఆగిరిపల్లి :** మండలంలోని ఈదులగూడెంలో సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్తు కోటేశ్వరరావు, ఎం.బాలయ్య(స్టాలిన్), కె.వెంకటేశ్వరరావు, నారాయణ, మణిమ్మ, రమణమ్మ పాల్గొన్నారు.

**జంగారెడ్డిగూడెం :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని సిపిఎం మండల కార్యదర్శి మానుకొండ జీవరత్నం పిలుపునిచ్చారు. సమరభేరిలో భాగంగా నాగులగూడెంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎన్.నాగరాజు, కె.సుబ్బారావు, కె.చిరంజీవి, జి.శ్రీను, ఆర్.రామారావు, లక్ష్మి, ఎ.దుర్గ పాల్గొన్నారు.




బుట్టాయగూడెం మండలంలో

**చాట్రాయి :** మండలంలోని చిన్నంపేటలో సిపిఎం సమరభేరిలో భాగంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ వి.రమేష్‌కు వినతిని అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమ్ము ఆనందం మాట్లాడారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి - నిడమర్రు**

వైసిపి అధికారంలోకొచ్చాక నాలుగున్నరేళ్ల కాలంలో భవన నిర్మాణ కార్మికులకు ఏ ఒక్క సంక్షేమ పథకం అమలు జరగలేదని, ప్రభుత్వం దారి మళ్లించి వాడుకున్న నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులు రూ.రెండు వేల కోట్ల సంక్షేమ బోర్డుకు జమ చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణరావు డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పెదనింద్రకొలను బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం మోటార్ సైకిల్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. పెదనింద్రకొలను నుంచి నిడమర్రు మండల కేంద్రం వరకు మోటార్ సైకిల్ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా రమణరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకొచ్చాక కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. భవన నిర్మాణ కార్మికులకు అన్ని రాష్ట్రాల్లోనూ ఉపాధి కల్పిస్తే మన రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం వారిని గాలికొదిలేసిందన్నారు. ఈ కార్యక్రమంలో చిన్నమిల్లి రాంబాబు, గౌడబత్తుల వాసు, సుబ్బారావు, పడాల శ్రీధర్, వెంకటేశ్వరరావు, తంగేళ్ల బాబూరావు, రాజు పాల్గొన్నారు.




నిరసన తెలుపుతున్న నాయకులు

# నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి

## పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ

**ప్రజాశక్తి - జీలుగుమిల్లి**

నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజు అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పోలవరం ముంపు గ్రామాలైన వాడపల్లి, ఎర్రవరం నిర్వాసిత కాలనీల్లో ఆయన శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలపై గ్రామస్తులను అడగగా వారు సమస్యలు ఏకరువు పెట్టారు. రెండేళ్ల నుంచి ఇదే కాలనీల్లో నివాసాలు ఉంటున్నామని, తమకు కనీస వసతులు కూడా కల్పించకపోవడంతో పలు సమస్యలతో సతమతమవుతున్నామని అవేదన వ్యక్తం చేశారు. కొంతమందికి కేటాయించిన భూముల్లో కొన్ని సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని కోరారు. మోటార్ పోయి నెల రోజులు కావస్తున్నా మరమ్మతులు చేయకపోవడంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. వారి సమస్యలు విన్న ఎంఎల్ఎ బాలరాజు మాట్లాడుతూ నిర్వాసితులకు ఎటువంటి సమస్య రాకుండా చూడాలని ఆయా శాఖల సంబంధిత అధికారులకు ఆదేశించారు. అనంతరం నిర్వాసిత కాలనీలో మొక్కలు నాటారు.

**పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు**

మండలంలోని చంద్ర మ్మ కాలనీలో రూ.32 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జీలుగుమిల్లి పిహెచ్‌సిలో రూ.50 లక్షల నిధులతో బ్లాక్ పబ్లిక్ హెల్త్ యూనిట్‌కు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిల సంఘం అధ్యక్షులు సుంకర వెంకటరెడ్డి, ఎంపిపి కోర్స పోసమ్మ, వైస్ ఎంపిపి సోమగాని శ్రీనివాస్, సర్పంచి చిర్రి జగదాంబ, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్, సొసైటీ అధ్యక్షులు బోదా శ్రీనివాస్, గాంధీ పాల్గొన్నారు.

**పోలవరం :** మండలంలోని నిర్వాసిత గ్రామాలైన వాడపల్లి, ఎర్రవరం గ్రామాల్లో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎంఎల్ఎ తెల్లం బాలరాజు శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా నిర్వాసితుల సమస్యలు అడిగి తెలుసుకుని వారి సమస్యలు త్వరితగతిన పరిష్కరించేలా మండల అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచి, తహశీల్దార్ బి.సుమతి, ఎంపిడిఒ జి.శ్రీను, ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, హౌసింగ్ ఎఇ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సిబ్బంది, ఎన్ఆర్‌జిఇఎస్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది, ఉన్నతాధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. అనంతరం నిర్వాసిత కాలనీల్లో కొబ్బరి మొక్కలను నాటారు.

# పారదర్శకంగా ఎస్ఐ పోస్టుల భర్తీ

## ఎపి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ అతుల్‌సింగ్

**ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఎస్ఐ పోస్టుల భర్తీ చేస్తుందని, ఎంపిక పోటీలను అత్యంత పారదర్శకంగా నిర్వహించేలా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు ఎపి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ అతుల్‌సింగ్ చెప్పారు. ఏలూరు రేంజ్ పరిధిలో ఎస్ఐ పోస్టుల భర్తీ ప్రక్రియలో భాగంగా ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో దేహదారుఢ్య పరీక్షలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అభ్యర్థులకు స్క్రీనింగ్ టెస్టు, దేహదారుఢ్య పరీక్షలు ఏ విధంగా సాగుతున్నాయో పరిశీలించారు. నిర్వహణ తీరుతో పాటు అభ్యర్థుల ఎంపికలపైనా ఆరా తీశారు. ఏలూరు రేంజ్ డిఐజి జివిజి.అశోక్‌కుమార్ ఫిజికల్ టెస్ట్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్‌పి డి.మేరీప్రశాంతి, కాకినాడ జిల్లా ఎస్‌పి ఎస్.సతీష్‌కుమార్‌తో పాటు ఎస్ఐ సెలక్షన్స్ సమీక్షించారు. పోటీలను నిష్పాక్షపాతంగా ఎలాంటి అవకతవకలు లేకుండా చేపట్టడంపై బోర్డు ఛైర్మన్ అతుల్సింగ్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఎపి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ అతుల్‌సింగ్ మాట్లాడుతూ ఎస్ఐ పోస్టుల నియామక ప్రక్రియలో మొదటి దశలో ప్రాథమిక రాత పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన అభ్యర్థులను రెండో దశ ఎంపికలు ఫిజికల్ టెస్టుకు పిలిచామని ఆయన తెలిపారు. దేహదారుఢ్య పరీక్షలు అత్యంత పగడ్బందీగా సీసీ కెమెరాల పర్యవేక్షణలో సమర్థవంతంగా చేపడుతున్నారని చెప్పారు. ఏలూరు రేంజ్ పరిధిలో 9689 మంది అభ్యర్థులు ఫిజికల్ టెస్టుకు హాజరయ్యేలా చర్యలు చేపట్టామని తెలిపారు. దేహదారుఢ్య పరీక్షలు పూర్తి చేసి అర్హులైన అభ్యర్థులకు తుది దశలో ఫైనల్ ఎగ్జామ్ నిర్వహిస్తామని, వాటిలో సత్తాచాటుకున్న వారు ఎస్ఐ పోస్టుల్లో నియమితులవుతారని స్పష్టం చేశారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి, అవాంతరాలు లేకుండా పరీక్షలు చేపడుతున్నామని చెప్పారు. ఏలూరు రేంజ్ పరిధిలో ఏలూరు జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి, బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్‌పి శ్రీధర్, కాకినాడ జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్, కృష్ణాజిల్లా ఎస్‌పి జాషువా ఆధ్వర్యంలో ఏలూరు రేంజ్ డిఐజి అశోక్ కుమార్ పర్యవేక్షణలో ఎంపిక ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సాగుతుందన్నారు. ఎస్ఐ పోస్టులు ఎంపిక పరీక్షలను ఏలూరు జిల్లా అదనపు ఎస్‌పి భాస్కరరావు, డిఎస్‌పిలు నున్న మురళీకృష్ణ, విజయాల్, ప్రభాకరరావు సిబ్బంది పటిష్టమైన బందోబస్తు మధ్య నిర్వహిస్తున్నారు.



దేహదారుడ పరీక్షలను పర్యవేక్షిస్తున్న అతుల్‌సింగ్

# తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

**ప్రజాశక్తి - ఏలూరు అర్బన్**

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసేమియా కేంద్రంలో శుక్రవారం 15 మంది తలసేమియా చిన్నారులకు డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె.వరప్రసాదరావు పర్యవేక్షణలో రక్తమార్పిడిని నిర్వహించినట్లు జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. డాక్టర్ ఆర్ఎస్ ఆర్‌కె ప్రసాదరావు మాట్లాడుతూ పెళ్లి చేసుకోబోయే యువత కొన్ని రకాల రక్త పరీక్షలు ముందుగా చేయించుకోవడం వల్ల పుట్టబోయే బిడ్డలకు జన్యుపరమైన వ్యాధులు రాకుండా చేసుకోవచ్చని అన్నారు. మానవత జిల్లా కేంద్ర నియంత్రణ కమిటీ, విద్యానిధి కమిటీ ఛైర్మన్ ఆలపాటి నాగేశ్వరరావు తలసేమియా చిన్నారులతో పాటు వారి తల్లిదండ్రులకు 35 మందికి ఉచిత భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రా2స్ కార్యదర్శి బి.బెన్ని, మానవత సభ్యులు కడియాల కృష్ణారావు, రత్నకరరావు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీనుకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



**ప్రజాశక్తి - ఉంగుటూరు**

మండలంలోని ఉప్పాకపాడు ఫౌండేషన్ ప్లస్ ప్రభుత్వ పాఠశాల సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్న అల్లు శ్రీనివాసరావు 2023 సంవత్సర రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైనట్లు ఉంగుటూరు ఎంఇఒ-1 నిమ్మగడ్డ రవీంద్రభారతి తెలిపారు. కష్టపడి పనిచేసే ఉపాధ్యాయులు అల్లు శ్రీనివాసరావుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చినందుకు అభినందనలు తెలిపారు. ఎంఇఒ-2 కె.శ్రీనివాసరావు, మండల కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు అభినందించారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే సిఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని పెదగొన్నూరులో శుక్రవారం నూతనంగా మంజూరైన పింఛన్లను పార్టీ నాయకులతో కలిసి ఆయన లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పార్టీలో ఉన్న వ్యక్తులకు మాత్రమే సంక్షేమ పథకాలు, పింఛన్లు జన్మభూమి కమిటీలు ద్వారా అందేవన్నారు. మండలంలో 173 కొత్త పింఛన్లు మంజూరయాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి తాడంకి శిరీషా, ఎంపిటిసి సభ్యులు టి.ఏసు, సొసైటీ ఛైర్మన్ ఎస్.పూర్ణ, పార్టీ నాయకులు తాడంకి రాజేష్, కెవి.సుబ్బారావు, బి.ప్రసాద్, బి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## కౌన్సిలర్ తాతాజీకి మాతృవియోగం

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

స్థానిక నాలుగో వార్డు మున్సిపల్ కౌన్సిలర్, జనసేన పార్టీ నాయకుడు వలవల తాతాజీకి మాతృవియోగం కలిగింది. తాతాజీ తల్లి వలవల నాగమణి (75) గురువారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. శుక్రవారం ఆమె అంత్యక్రియలను నిర్వహించారు. ఆమె మృతికి పలువురు పట్టణ ప్రముఖులు, రాజకీయ పార్టీల వారు సంతాపం తెలిపారు. అంత్యక్రియల కార్యక్రమంలో జనసేన చింతలపూడి కన్వీనర్ మేకా ఈశ్వరయ్య, ఎస్ఆర్ లాడ్జి అధినేత సింగంశెట్టి సత్తిరాజు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, డాక్టర్ కాకర్ల రాజేంద్రబాబు, మున్సిపల్ కౌన్సిలర్ మానవత మూర్తి, న్యాయవాది యు.ఏసుబాబు, చింతల నాని, సినీ డైరెక్టర్ బి.ప్రసాద్‌రాజు, సీనియర్ జర్నలిస్ట్ కెఎస్.శంకరరావు సంతాపం తెలిపారు.

## నేరాలు - ఘోరాలు

### రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి మండలంలోని పెదపాలపర్రులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పెదపాలపర్రు గ్రామానికి చెందిన చోడబండ సత్యనారాయణ స్థానిక జెడ్‌పి హైస్కూల్‌లో నైట్ వాచ్‌మేన్‌గా పని చేస్తుంటాడు. గురువారం సత్యనారాయణకు పని ఉండడంతో తనకు మారుగా తన తండ్రి పోలీనాయుడు (76) నైట్ డ్యూటీకి పంపించాడు. రాత్రి తొమ్మిది గంటల సమయంలో పోలీనాయుడు ఇంటి వద్ద నుంచి నడచుకుంటూ స్కూల్ దగ్గరకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో నందివాడ నుంచి భీమవరం వెళ్తున్న ఎఫ్ఆర్ కారు స్కూల్ దగ్గర పోలీనాయుడును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో పోలీనాయుడుకు తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని కుమారుడు సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించి అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

### పెట్రోల్ దొంగ అరెస్టు

**ప్రజాశక్తి - నూజివీడు రూరల్**

నూజివీడు పట్టణంలోని ద్వారకా నగర్ రోడ్డు నెంబర్ వన్‌లో పెట్రోల్ చోరీ చేస్తున్న నిందితుడిని శుక్రవారం స్థానికులు పట్టుకున్నారు. అపార్ట్‌మెంట్‌లోని వాహనంలోని పెట్రోలు దొంగతనం చేస్తుండగా స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వివాహిత అదృశ్యంపై కేసు

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

వివాహిత అదృశ్యంపై కేసు జంగారెడ్డిగూడెం పోలీసులు కేసు నమోదు చేశారు. హెచ్‌సి ఎన్.ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఆగస్టు 22న మండలంలోని కేతవరంలోని పుట్టింటికి తన భార్య వాణి సత్యలక్ష్మి వచ్చినట్లు నల్లజర్ల మండలం కవులూరుకు చెందిన జెట్టి రామకృష్ణ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తన భార్య తల్లితండ్రులు ఆమె ఫోన్ తీసుకున్నట్లు తెలిపారు. తరువాత రెండు రోజులు బాగానే ఉందని, అయితే ఇంట్లో ఎవరూ లేని సమయంలో 29వ తేదీన మధ్యాహ్న సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తెలిపారు. నల్లజర్ల గ్రామానికి చెందిన ఆవినాష్‌తో మోటార్‌సైకిల్‌పై వెళ్లినట్లుగా తనకు తెలిసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### హత్యాయత్నం కేసు నమోదు

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

భార్యపై భర్త హత్యాయత్నం చేసిన ఘటనపై జంగారెడ్డిగూడెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ సాగర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం... స్థానిక తాండ్ర పాపారాయుడు నగర్‌కు చెందిన వీరమల్లు గంగాభవానికి, వీరమల్లు శ్రీనుకు 16 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. గత కొంతకాలంగా భార్యాభర్తలు విడిగా ఉంటున్నారు. గంగాభవాని వేరే వ్యక్తితో సహజీవనం చేస్తుందని భావించిన శ్రీను కీచైన్‌కు ఉండే చాకుతో భార్య గంగాభవాని పీకను కోసినట్లు తెలిపారు. ఆమె స్పృహ తప్పి పడిపోగా శ్రీను పారిపోయినట్లు తెలిపారు. ఆమెను స్థానిక ఆసుపత్రిలో చేర్చి చికిత్స చేస్తున్నట్లు చెప్పారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

### కట్నం వేధింపులపై కేసు

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

కట్నం వేధింపులపై ముదినేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఊటుకూరుకు చెందిన చిట్టిబొమ్మ నాగమల్లేశ్వరరావుకు 11 ఏళ్ల క్రితం అమలేశ్వరితో వివాహమైంది. నాగమల్లేశ్వరరావు ప్రస్తుతం మచిలీపట్నంలో ఎఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. కొంతకాలంగా భర్త, అత్తమామలు అదనపు కట్నం తీసుకురావాలంటూ అమలేశ్వరిని వేధిస్తున్నారు. గురువారం సాయంత్రం భర్త కర్రతో భార్యను కొట్టడంతో ఆమెకు బలమైన గాయాలయ్యాయి. దీంతో భార్య చికిత్స నిమిత్తం గుడివాడ ఏరియా ఆసుపత్రిలో చేరింది. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### పరిస్థితి విషమించి వ్యక్తి మృతి

**ప్రజాశక్తి - మండవల్లి**

మద్యం తాగొద్దని భార్య మందలించడంతో మనస్తాపానికి గురైన భర్త పురుగుల మందు తాగి మృతి చెందిన ఘటన మండలంలోని గన్నవరంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గన్నవరం గ్రామానికి చెందిన ముల్లపూడి శ్రీనివాసరావు(39) మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్య రమాదేవి మద్యం తాగవద్దని మందలించింది. దీంతో మనస్థాపానికి గురైన శ్రీనివాసరావు గత నెల 26న అర్ధరాత్రి సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు అతడిని కైకలూరు ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అక్కడి నుంచి విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. మృతుని భార్య రమాదేవి మండవల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# భీమడోలులో ట్రైనీకలెక్టర్ పర్యటన

**ప్రజాశక్తి - భీమడోలు**

గ్రామ పంచాయతీ పరిపాలన, పనితీరు, ఇతర అంశాలపై శిక్షణా కలెక్టర్లకు ట్రైనింగ్ సెంటర్‌గా భీమడోలు గ్రామ పంచాయతీ మారింది. జాతీయ స్థాయిలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం నిర్వహణకు ఉత్తమ గ్రామ పంచాయతీగా ప్రతిపాదించిన భీమడోలు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం కేంద్ర, రాష్ట్ర స్థాయి అధికారులకు సందర్శనకు వేదికగా మారింది. ఇదే క్రమంలో శిక్షణ కలెక్టర్ పూజ తిరుమని భీమడోలులో శుక్రవారం నుంచి నాలుగు రోజుల పాటు పర్యటించనున్నారు. ప్రజలతో మమేకమై వివిధ అంశాలపై అవగాహన పొందనున్నారు. దీనిలో భాగంగా భీమడోలు గ్రామపంచాయతీ పర్యటనకు వచ్చిన శిక్షణా కలెక్టర్‌కు గ్రామ సర్పంచి పి.సునీతమాన్సింగ్, గ్రామపంచాయతీ కార్యదర్శి ఎన్.ఠాగూర్ స్వాగతం పలికారు. అనంతరం గ్రామ సర్పంచి గ్రామపంచాయతీ పాలన, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల అమలు తీరు, సమస్యలను గుర్తించటం వంటి అంశాల గురించి శిక్షణా కలెక్టర్‌కు తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి పంచాయతీ ఆదాయ వనరులు, అదనపు ఆదాయం పెంచుకునేందుకు గ్రామపంచాయతీ చేపడుతున్న వివిధ కార్యక్రమాలు, దీని కోసం స్థానికంగా అందుబాటులో ఉన్న వనరులు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు తీరు, రికార్డుల నిర్వహణ ఇతర అంశాల గురించి శిక్షణ కలెక్టర్‌కు వివరించారు. ఇదే క్రమంలో శనివారం శిక్షణ కలెక్టర్ తన పర్యటన భాగంగా గ్రామవీధుల్లో పర్యటించనున్నారని, సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించమన్నారని, ప్రజలతో మమేకమై గ్రామపంచాయతీ పాలనపై వారి అభిప్రాయాలు తెలుసుకుంటారని, సూచనలను స్వీకరిస్తారని గ్రామపంచాయతీ కార్యదర్శి తెలిపారు. ఇదే క్రమంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి వివిధ విభాగాల పనితీరును పరిశీలిస్తారని, గ్రామపంచాయతీతో పాటు గ్రామపంచాయతీ పరిధిలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, వైద్యశాలను కూడా సందర్శించనున్నారని తెలిపారు.



భీమడోలులో పర్యటిస్తున్న శిక్షణా కలెక్టర్

## 7, 8 తేదీల్లో ఆటల పోటీలు

**ప్రజాశక్తి - నూజివీడు రూరల్**

మండలంలోని పల్లెర్లమూడిలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఈ నెల 7, 8 తేదీల్లో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ జమలయ్య తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాలలో శుక్రవారం ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆటలు ఆవశ్యకతను వివరించారు. ఈ నెల 7వ తేదీన బాలురకు, 8వ తేదీన బాలికలకు ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో హైస్కూలు ప్రధానోపాధ్యాయులు హనుమంతరావు, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## సర్వే వేగవంతం చేయాలి

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

స్వామిత్వ సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపిడిఒ పి.మల్లీశ్వరి కోరారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం 18 సచివాలయాల కార్యదర్శులకు అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వామిత్వ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి టివి.సారధి, వివిధ సచివాలయాల అధికారులు,కార్యదర్శులు పాల్గొన్నారు.

## 'లోకేష్ వ్యాఖ్యలు సరికావు'

**ప్రజాశక్తి - పోలవరం**

పోలవరం ఎంఎల్ఎ తెల్లం బాలరాజుపై నారా లోకేష్ అనుచిత వ్యక్తులు చేసినందుకు పోలవరం మెయిన్ సెంటర్‌లో లోకేష్ దిష్టిబొమ్మను వైసిపి నేతలు శుక్రవారం దహనం చేశారు. ఈ సందర్భంగా వైసిపి మండల నాయకులు, మండల కన్వీనర్ బుగ్గ మురళీకృష్ణ, జెడ్‌పిటిసి సభ్యులు కాలుం హేమ కుమారి మాట్లాడుతూ తెల్లం బాలరాజుపై లోకేష్ వ్యాఖలు సరికావన్నారు. వైసిపి ప్రభుత్వాన్ని, ఎంఎల్ఎలను విమర్శించే స్థాయి చంద్రబాబుకు, లోకేష్‌కు లేదన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బుగ్గ మురళీకృష్ణ, జెడ్‌పిటిసి సభ్యులు కలుం హేమకుమారి, సొసైటీ అధ్యక్షులు బి.అప్పారావు, పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ కొరశిక శ్రీను, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

## దోమల నిర్మూలన మందు పిచికారీ

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

మండల కేంద్రమైన ముదినేపల్లిలో శుక్రవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో దోమల నిర్మూలన మందును పిచికారీ చేశారు. గ్రామంలో జ్వరాలు అధికంగా ఉండడం వల్ల దోమల నిర్మూలన కోసం మందును పిచికారీ చేసినట్లు గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ తెలిపారు. ఈ పనులను సర్పంచి దగ్గర ఉండి పర్యవేక్షించారు.

## జనసేన ఆధ్వర్యాన పలు సేవా కార్యక్రమాలు

**ప్రజాశక్తి - భీమడోలు**

జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని ఆ పార్టీ భీమడోలు శాఖ ఆధ్వర్యంలో భీమడోలులో శుక్రవారం ముందస్తు సేవా కార్యక్రమాలు చేపట్టారు. దీనిలో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం సమీపంలోని హైస్కూల్ బాలికల వసతి గృహం, ఆనందనిలయాలకు చెందిన విద్యార్థినుల సౌకర్యార్థం సుమారు రూ.పది వేల విలువైన నాలుగు ఫ్యానులు, ఆరు విద్యుత్ దీపాలను శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా భీమడోలు శాఖ అధ్యక్షులు పత్తి మదన్ మాట్లాడుతూ వసతి గృహానికి చెందిన విద్యార్థినులు ఫ్యాన్లు లేక ఇబ్బంది పడుతున్న విషయం తమ శాఖ దృష్టికి వచ్చిందన్నారు. పూర్తిస్థాయి దీపాలు లేని కారణంగా విద్యార్థినులు చదువుకోవటానికి ఇబ్బంది పడటం గమనించామన్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకుని వసతి గృహానికి చెందిన విద్యార్థినుల కోసం ఫ్యాన్లు, విద్యుత్ దీపాలను పవన్‌కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని ముందస్తుగా అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు టి.రామ్మూర్తి, దుర్గాపల్లవి, డి.సునీల్, ఎన్.అజయ్ పాల్గొన్నారు.

## 15 వరకూ స్వచ్ఛ పక్వాడ

**ప్రజాశక్తి - ముసునూరు**

మనం నివసిస్తున్న ఇంటిని, పాఠశాలను, గ్రామాన్ని, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిల్క్ నగర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొప్పుల బాబురావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ముసునూరు సిల్క్ నగర్ పాఠశాలలో భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛ పక్కాడ కార్యక్రమం శుక్రవారం పాఠశాలలో ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఈ నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులతో స్వచ్ఛపక్వాడ ప్రతిజ్ఞ చేయించారు.

## ఘనంగా శ్రావణ మాస ఉత్సవాలు

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

స్థానిక నూకాలమ్మ ఆలయంలో శ్రావణ మాస ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ ఛైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ తెలిపారు. శ్రావణమాస ఉత్సవాల్లో భాగంగ ఆలయ కమిటీ ఛైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ పట్టణ పరిసర ప్రాంతాల ప్రజలు శ్రావణ మాస ఉత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్, పోలుపర్తి రాము, చిట్లూరి సుబ్బారావు, నౌడు నూకరాజు, పట్టణ ప్రముఖులు, మహిళలు పాల్గొన్నారు .

## విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేత



క్రీడాసామగ్రి అందిస్తున్న ఉపాధ్యాయుడు

**ప్రజాశక్తి - ముసునూరు**

బదిలీపై వచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు మహమ్మద్ అలీ ఖాన్ విద్యార్థుల కోసం శుక్రవారం రూ.20 వేలతో క్రీడా సామగ్రిని పాఠశాలకు ఉచితంగా అందించారని పాఠశాల హెచ్ఎం సునీల తెలిపారు. క్రీడా సామగ్రి వాలీబాల్స్, త్రో బాల్స్, షటిల్‌నెట్, బేస్‌బాల్ తదితర సామగ్రి అందించినందుకు హెచ్ఎం, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు క్రీడా రంగంలో మంచిగా రాణించాలని మొహమ్మద్ అలీ ఖాన్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం వాణికుమారి, రెండో పీడీ హేమాదేవి, నాగేశ్వరరావు, ఫ్రాన్సిస్ పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలని వినతి

**ప్రజాశక్తి - పోలవరం**

జీలుగుమిల్లి మండలంలోని ఓ గ్రామంలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎంఎల్ఎ తెల్లం బాలరాజుకు పోలవరం మండలంలోని ఎల్ఎన్‌డి పేట, ఆర్అండ్ఆర్ పునరావాస కాలనీ కొండ్రుకోటలో సుమారుగా ఐదు గ్రామాల నిర్వాసితులైన కొరుటూరు తూటిగుంట కొండ్రుకోట పంచాయతీలకు సంబంధించి పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించారు. కుటుంబ యజమానికి ఒరిజినల్ ఇంటి పట్టా ఇవ్వాలని కోరారు. ప్రభుత్వ అధికారులతో మాట్లాడి ఇంటి పట్టాలు ఏర్పాటు చేస్తామని ఎంఎల్ఎ బాలరాజు తెలిపారు.



వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

## నేటి యువగళం పాదయాత్రకు సర్వం సిద్ధం

### టిడిపి జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు

**ప్రజాశక్తి - ఉంగుటూరు**

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర ఈ నెల రెండో తేదీఉంగుటూరు నియోజకవర్గానికి చేరనుందని ఆ పార్టీ ఏలూరు పార్లమెంటరీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు వెల్లడించారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలంలోని సింగరాజుపాలెం నుంచి ఉంగుటూరు మండలం నీలాద్రిపురంలోకి లోకేష్ ప్రవేశిస్తారన్నారు. అనంతరం అక్కడ యాదవ సామాజిక వర్గం వారితో మాటామంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నామన్నారు. అక్కడ నుంచి ఉంగుటూరు బయలుదేరి బిసిలతో మమేకం అవుతారు. ఉంగుటూరు నుంచి జాతీయ రహదారి వెంబడి పాదయాత్ర చేస్తూ నారాయణపురంలో లయన్స్ క్లబ్ కల్యాణ మండపం సమీపంలో బహిరంగ సభలో ఎస్‌సి సామాజిక వర్గం వారితో ఇంట్రాక్ట్ అవుతారు. అక్కడ భోజనం చేశాక రాత్రికి నిడమర్రు మండలం చిననింద్రకొలనులోకి లోకేష్ పాదయాత్ర ప్రవేశిస్తుందని తెలిపారు.

## దోమల నిర్మూలన సామాజిక బాధ్యతగా తీసుకోవాలి





డ్రైడే ర్యాలీలో సిబ్బంది

**ప్రజాశక్తి - ఏలూరు టౌన్**

క్లీన్ మాదేపల్లి, గ్రీన్ మాదేపల్లికి ప్రజలు సహకరించాలని, దోమల నిర్మూలన ప్రజలు సామాజిక బాధ్యతగా భావించాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా ప్రాణాంతకమైన డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధులను కొంతవరకు నివారించుకోవచ్చన్నారు. స్థానిక ఏలూరు రూరల్ మండలంలోని గుడివాకులంక పిహెచ్‌సి పరిధి మాదేపల్లిలో ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన, డ్రైడే కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనకు ఎక్కువగా హాని చేసే డెంగీ కారక దోమ, మలేరియా కారక దోమ మన గృహాల్లో ఉండే మంచి నీటి నిల్వ ప్రాంతాల్లో పెరుగుతాయన్నాయారు. దోమలను నిర్మూలించాలంటే ప్రతిఒక్కరూ వారానికి ఒకసారి ఫ్రైడే డ్రైడే ఆచరించాలని తెలిపారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచి జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా స్థానిక ఎఎన్ఎంను, ఆశ కార్యకర్తను ఎంఎల్‌హెచ్‌పిని సంప్రదించాలని, డెంగీ, మలేరియా కిట్స్ స్థానిక మాదేపల్లి వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్‌లో ఉన్నాయని, అశ్రద్ధ చేయకుండా వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక గుడివాకలంక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎంపిహెచ్ఇఒ ఉమా మహేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్స్ శశావతారం, నాగమల్లేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పి.ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్స్ శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

## గోపీనాథపట్నంలో మెగా వైద్య శిబిరం

**ప్రజాశక్తి - ఉంగుటూరు**

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా పల్లె ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సహాయం అందించాలనే లక్ష్యంతో మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు జనసేన ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. పవన్‌కల్యాణ్ పుట్టినరోజు వేడుకల్లో భాగంగా మండలంలోని గోపినాథపట్నంలో లక్ష్మీనారాయణ అన్నదాన సత్రం ప్రాంగణంలో శుక్రవారం మెగా వైద్య శిబిరం, మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఏలూరు ఆశ్రమం, విజయవాడ మణిపాల్ ఆసుపత్రులు, భీమవరం విష్ణు కాలేజీ వైద్య నిపుణుల ప్రోద్భలంతో లక్ష్మీ నారాయణ ఫౌండేషన్ ఛైర్మన్, జనసేన ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి ధర్మరాజు సహకారాలతో పేదలకు ఉచిత వైద్య సేవలు అందించారు. విజయవాడకు చెందిన మణిపాల్ హాస్పిటల్ వైద్య బృందం క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఏలూరు ఆశ్రమానికి చెందిన కంటి నిపుణులు, జనరల్ వైద్యులు, స్త్రీల ప్రసూతి వైద్యులు, చెవి ముక్కు గొంతు వైద్యులు, చర్మవ్యాధుల నిపుణులు, గుండె సంబంధిత నిపుణులు, భీమవరం విష్ణు కాలేజీ డెంటల్ వైద్యులు 614 మందికి ఉచిత పరీక్షలు నిర్వహించారు. లక్ష్మీ నారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో కొంతమందిని శస్త్ర చికిత్సల కోసం ఏలూరు ఆశ్రమం హాస్పిటల్‌కు, భీమవరం డెంటల్‌కు రిఫర్ చేశారు. ఈ శిబిరానికి విచ్చేసిన వారందరికీ మజ్జిగ, భోజన వసతులను కల్పించారు. పవన్‌కల్యాణ్ అభిమానులు, జనసేన నాయకులు, జనసైనికులు 170 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పిఎసి సభ్యులు వేగేశ్న కనకరాజు సూరి, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఘంటశాల వెంకటలక్ష్మి, జిల్లా కార్యదర్శులు కరాటం సాయి, చెనమాల చంద్రశేఖర్, రవి జిల్లా ఉపాధ్యక్షులు ఇల్లా శ్రీనివాస్, బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శరణాల మారుతీరాణి పాల్గొన్నారు.

## రానున్న ఎన్నికల్లో టిడిపిదే విజయం

**ప్రజాశక్తి - నూజివీడు రూరల్**

రానున్న ఎన్నికల్లో విజయం టిడిపిదేనని మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ కాప శ్రీనివాసరావు అన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్ర గాలిలో వైసిపి నాయకులు కొట్టుకుపోవడం ఖాయమన్నారు. నూజివీడు పట్టణంలోని ఎన్‌టిఆర్ భవన్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. దిగ్విజయంగా 200 రోజులు పాదయాత్ర చేసిన యువనేత నారా లోకేష్ ఎవరికి భయపడే వ్యక్తి కాదన్నారు.



## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎల్ఐసి డే

**ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం**

జీవనజ్యోతి బీమా యోజన రూ.330 చేస్తే రూ.2లక్షల వరకు జీవిత బీమా వస్తుందని రూ.12 కడితే జీవన సురక్ష బీమా యోజన ప్రమాద బీమా వస్తుందని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.ప్రసాద్‌బాబు తెలిపారు. ఆయన అధ్యక్షతన కామర్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎల్ఐసి డే నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఎన్.ప్రసాద్‌బాబు మాట్లాడుతూ ఇన్సూరెన్స్‌కి ఎంతో ప్రాముఖ్యం ఉందన్నారు. విద్యార్థులు మాత్రమే తెలుసుకోవడం కాకుండా ఈ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేయాలని చెప్పారు. కామర్స్ డిపార్ట్‌మెంట్ ఇన్‌ఛార్జి డాక్టర్ కె.ఉత్తమ్‌సాగర్ మాట్లాడుతూ ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ గురించి ఆరోగ్య బీమా విలువ గురించి ఆరోగ్య బీమా చేసుకోవడం వల్ల చేకూరే ప్రయోజనాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి.శ్రీనివాస్, కామర్స్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు సిహెచ్.రమాదేవి, కెవి.శిరీష, ఇతర అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## పెరటి కోళ్ల యూనిట్లను వినియోగించుకోండి

**ప్రజాశక్తి - భీమడోలు**

డ్వాక్రా సంఘాల సభ్యులకు అదనపు ఆదాయం వనరుగా ప్రభుత్వం అందిస్తున్న పెరటి కోళ్ల పెంపకం పథకం సేవలను వినియోగించుకోవాలని భీమడోలు ఐకెపి ఎపిఎం సురేష్‌కుమార్ కోరారు. పథకంలో భాగంగా మండలంలో ఎంపిక చేసిన 50 మంది డ్వాక్రా సంఘాల సభ్యులకు పెరటి కోళ్ల పెంపకం యూనిట్ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం రాత్రి నిర్వహించారు. దీనిలో భాగంగా ఒక్కొక్క యూనిట్‌లో 600 గ్రాముల బరువు గల తొమ్మిది కోడిపెట్టలు, మూడు కోడి పుంజులతో పాటు కోళ్ల దాణా, వాటి ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన మందులను రూ.4,450 ధరకు అందించారు. వీటికి ఏ విధమైన రాయితీ లేదు. యూనిట్ల పంపిణీ సందర్భంగా ఎపిఎం మాట్లాడుతూ ప్రస్తుతం పెరటి కోళ్ల పెంపకం యూనిట్లు తీసుకున్న లబ్ధిదారులు కోళ్ల పెంపకం యూనిట్ల ఆధారంగా మరింతగా కోళ్ల సంపదను అభివృద్ధి పరిచి, వ్యాపారపరంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వీటి వల్ల వారికి అదనపు ఆదాయం సమకూరడంతో పాటు పెంపకం యూనిట్ల కుటుంబ సభ్యులకు పౌష్టికాహారం అందించేందుకు, ఆరోగ్య పరిరక్షణకు సహకరిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐకెపి కార్యాలయం ,భీమడోలు సహాయ అధికారి సావిత్రి పాల్గొన్నారు.

## 'ప్రజా సంక్షేమమే జగన్ ధ్యేయం'

**ప్రజాశక్తి - మండవల్లి**

ప్రజా సంక్షేమానికి సిఎం జగన్ కృషి చేస్తున్నారని మండవల్లి సర్పంచి మెండ జాన్సి అన్నారు. మండవల్లి సచివాలయం వద్ద ఆమె పెన్షన్ దారులకు శుక్రవారం పెన్షన్ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండవల్లిలో 13 మందికి కొత్త పెన్షన్లను అందించినట్లు చెప్పారు. ప్రజా సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి అర్హులైన లబ్ధిదారులకే అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు బొమ్మనబోయిన స్వాతి, గుడివాడ మురళి, వైసిపి నాయకులు దోసనపూడి నాంచారయ్య, మెండ సురేష్ పాల్గొన్నారు.

**చింతలపూడి :**పట్టణంలో రేచర్ల సచివాలయంలో శుక్రవారం 16 మందికి నూతన పెన్షన్లు అందించారు. ఈ సందర్భంగా ఎంపిపి రాంబాబు మాట్లాడుతూ ప్రజలందరు మళ్లీ జగనే సిఎంగా ఉండాలని కోరుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి శివరామకృష్ణ, వైస్ సర్పంచి బాలకృష్ణ, కార్యదర్శి నాగిరెడ్డి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

## శ్రీవారికి రూ.9.70 కోట్ల ఆదాయం

**ప్రజాశక్తి - ద్వారకాతిరుమల**

ద్వారకాతిరుమల వెంకటేశ్వరస్వామికి భక్తులు సమర్పించిన తలనీలాలు పోగు చేసుకునేందుకు వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో స్వామి వారికి రికార్డు స్థాయిలో రూ.9.70 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ వేలంపాటలో మొత్తం నలుగురు పాటదారులు పాల్గొనగా కెవి ఎంటర్‌ప్రైజెస్, ప్రొద్దుటూరు వారు రూ.9.70 కోట్లకు రెండేళ్ల కాల పరిమితికి హెచ్చుపాటదారులుగా నిలిచారని ఆలయ అధికారులు తెలిపారు.